
సాక్షి ఒడిశా

మంగళవారం ၊ 21 ၊ నవంబర్ ၊ 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,96,647లు, బంగారం 7గాము 950 మిల్లీగ్రాములు, వెండి 46 గ్రాములు 400 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సామాజిక శ్రేయస్సుకు విద్య కీలకం

ఆర్థిక, సామాజిక శ్రేయస్సుకు విద్య కీలకమని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.

- 8లో



సభా సమయం

రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

అలరిస్తున్న త్యాగరాజు కీర్తనలు



కీర్తనలు వినిపిస్తున్న దృశ్యం

బరంపురం: స్థానిక గిరి మార్కెట్ రోడ్డులోని ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజ మందిరంలో త్యాగరాజు భక్త సమితి ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న త్యాగరాజు కీర్తనలు అలరిస్తున్నాయి. ఆదివారం రాత్రి జరిగిన ఉత్సవాల్లో భాగంగా నూజివీడుకి చెందిన బంకుపల్లి వేంకట విద్యాసాగర్ గాత్రంలో బెంగుళూరుకి చెందిన వయోలిన్ సరస్వతుల పార్థీవా మరియు శ్రీకాకుళం ఆమదాలవలసకి చెందిన బంకుపల్లి దుర్గాప్రసాద్ శర్మ మృదంగంలో త్యాగరాజ కచేరి సందర్శకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు డా.ఈపరి జయంతిరావు, కోశాధికారి కేబీ కృష్ణ ప్రసాద్, వీవీ రవికుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాబెర్రీ సాగుకు శ్రీకారం



స్ట్రాబెర్రీ పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని రామనగుడలో ప్రప్రథమంగా జిల్లా యంత్రాంగం స్ట్రాబెర్రీ సాగుకు శ్రీకారం చుట్టింది. సమితి పరిధిలోని పాలుపాయిలో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఈ సాగును ప్రారంభించింది. జిల్లా అదనపు కలెక్టర్ రామేశ్వర్ ప్రధాన్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. స్వయం సహాయక బృందాలకు చెందిన కొంతమంది మహిళలను కందమాల్ జిల్లాలోని దారింగిబడి ప్రాంతంలో సాగుకు సంబంధించి తగిన మెలకువలను నేర్పించి వారిచే ఈ సాగును చేయిస్తున్నారు. ఒడిశా జీవికా మిషన్, ఉద్యాన విభాగం సంయుక్తంగా వీరికి సహకారాన్ని అందిస్తూ తగిన ప్రోత్సాహం కల్పిస్తున్నారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక వ్యవసాయ విధానాలను అవలంభించి సాగుకు శ్రీకారం చుట్టారని ఉద్యాన విభాగం డిప్యూటీ డైరెక్టర్ జగన్నాథ బిందాని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రామేశ్వర్ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ విధానాల్లో రైతులకు తగిన మెలకువలను నేర్పించి, వారికి ఇటువంటి లాభదాయకమైన వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించడం అభినందించాల్సి విషయమన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే ఇటువంటి వాణిజ్య పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం స్ట్రాబెర్రీ పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్ కుమార్ కుహారో, రామనగుడ బీడీవో ప్రద్యుమ్న మండల్, గుణుపూర్ ఐటీడీఏ అధికారి శాంతి ప్రభ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్ ఎన్నిక నేడు

- బీజేడీ ఎమ్మెల్యే సలుగ ప్రధాన్ నామినేషన్ దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న సలుగ ప్రధాన్

భువనేశ్వర్: శాసనసభ డిప్యూటీ స్పీకర్ ఎన్నికకు ఒకరోజు ముందు బిజు జనతా దళ్ (బీజేడీ) ఎమ్మెల్యే సలుగ ప్రధాన్ సోమవారం నామినేషన్ దస్తావేజులు దాఖలు చేశారు. మంగళవారం ఈ పదవికి ఎన్నిక జరగనుంది. సలుగ ప్రధాన్ కందమల్ జిల్లా బీజేడీ ప్రముఖ గిరిజన నాయకుడు కావడం విశేషం. బిజూ జనతాదళ్ సంస్థాగత వ్యవహారాలు పర్యవేక్షించేందుకు ఈనెల 9న రజనీకాంత్ సింగ్ రాజీనామా చేసి డిప్యూటీ స్పీకర్ పదవి నుంచి వైదొలగిన విషయం తెలిసిందే. ఈ ఖాళీ భర్తీ చేసేందుకు తాజా ఎన్నిక జరుగుతుంది. ఒడిశా అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న సందర్భంగా మంగళవారం ఉదయం 9.30 గంటలకు డిప్యూటీ స్పీకర్ పదవి ఎన్నికకు పోలింగ్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఈనెల 14న శాసనసభ కార్యదర్శి సభలోని సభ్యులందరికీ లేఖ జారీ చేశారు.

ఇంకెన్నాళ్లీ వేదన..!



అదనపు ఎస్పీతో మాట్లాడుతున్న ప్రజలు



ఆందోళనలో పాల్గొన్న మినిగాం గుడ ప్రజలు



మినిగాం గుడ రోడ్డు దుస్థితి



పోలీసులతో ఆందోళనకారుల వాగ్వివాదం

కాశీనగర్ సమితి కె.సీతాపురం పంచాయతీ మినిగాం గుడ గ్రామానికి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మినిగాం మెయిన్ రోడ్డు వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. రోడ్డు లేకపోవడం వలన ఆపద సమయంలో రోగులు, గర్భిణులు ఆస్పత్రులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని గిరిజనులు తెలియజేశారు. ఈ ప్రాంతం ఆంధ్రా సరిహద్దులో ఉండడంతోనే అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అదనపు ఎస్పీ సునీల్ మహంతి, కాశీనగర్ తహసీల్దార్ అశోక్ కుమార్ బెహరాలు సంఘటన స్థలానికి విచ్చేసి గిరిజనులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపచేశారు. అదే సమయంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ప్రజా స్పందన కార్యక్రమం నుంచి వస్తుండగా కలిసి తమ గోడును విన్నవించారు. అయితే దీనిపై కలెక్టర్ స్పందించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

– పర్లాకిమిడి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రుల వద్ద గుమిగూడిన ప్రజలు

జయపురం: కుంద్రా–జయపురం మార్గంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారు కుంద్రా సమితి నొయికెర గ్రామానికి చెందిన లక్ష్మణ భొత్ర(32), సుఖదేవ్ భొత్ర(28) లుగా గుర్తించారు. గాయపడిన వారిని వెంటనే కుంద్రా కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జయపురం ఫూల్‌బెడలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మణ భొత్ర, సుఖదేవ్ భొత్రలు ఏదో పనిమీద ద్విచక్ర వాహనంపై జయపురం బయల్దేరారు. ఆ మార్గంలో పెట్రోలు బంక్ సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అచేతనంగా రోడ్డుపై పడ్డారు. ప్రమాద విషయం తెలిసిన కుంద్రా పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్ నేతృత్వంలో సబ్ ఇన్‌స్పెక్టర్ గోవింద హంసద, ఏఎస్‌ఐ మీనకేతన పాత్రో ఇతర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ ఉన్నటువంటి కుంద్ర సమితి కాంగ్రెస్ అధ్యక్షుడు సురేంద్ర పొరజ, మను మల్లిక్, అదు శాంత, సురేంద్ర సాగరియ తదితరుల సాయంతో క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పెట్రోలు బంక్ ప్రాంతంలోని సీసీ కెమేరాల పుటేజీలను పరిశీలించిన తర్వాత ఎలా ప్రమాదం జరిగిందో తెలుస్తుందని పోలీసులు పేర్కొన్నారు.

సహకార బ్యాంకులతో మేలు



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పర్లాకిమిడి: కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా రైతులు, మహిళా స్వయం సహాయక గ్రూపులకు మేలు జరుగుతోందని అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్ అన్నారు. స్థానిక బిజూ కల్యాణ మండపంలో సర్వ భారతీయ సహకార సొసైటీల వారోత్సవాల ముగింపు సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ శక్తి గ్రూపులు, కో–ఆపరేటివ్ సొసైటీపై నిర్వహించిన వివిధ వక్తృత్వ, డ్యాన్స్ పోటీల్లో విజయం సాధించినవారికి నగదు పురస్కారం అందజేశారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ జ్ఞాన రంజన్ మఝి, అసిస్టెంట్ కో–ఆపరేటివ్ రిజిస్ట్రార్ హరిహర శెఠి, నాబార్డు బ్యాంక్ మేనేజర్ ప్రతీక్ పండా, అసిస్టెంట్ కో–ఆపరేటివ్ రిజిస్ట్రార్ నారాయణ శెఠి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గంజాయి పంట ధ్వంసం



డాబర్‌కొనలో గంజాయి పంట వద్ద పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుడారి, పద్మపూర్ సమితుల్లో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి తోటలను ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేస్తున్నారు. దీనిలో భాగంగా పద్మపూర్‌లోని డాబర్‌కొనలో 4 వేలు, గుడారిలోని జయపంగలో మరో 3వేల మొక్కలను సోమవారం ధ్వంసం చేశారు. గత మూడు రోజులుగా దాడులు కొనసాగుతున్నాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ అభిరాం బెహర తెలియజేశారు. గంజాయిపై ఉక్కుపాదం మోపిన అధికారులు ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో విరివిగా వాహన తనిఖీలు సైతం నిర్వహిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణ, సాగును అంతమొందించేందుకు తమవంతు కృషి చేస్తామని బెహర తెలియజేశారు.



జయపంగలో గంజాయి పంటను తగలబెడుతున్న అధికారులు

గో మాంసం పట్టివేత



సీజ్ చేయబడిన వ్యాన్



పట్టుబడిన గో మాంసం

బరంపురం: ఛత్రపూర్ జంక్షన్ 16వ నంబర్ జాతీయ రహదారి గుండా నగరానికి అక్రమంగా గో మాంసం రవాణా చేస్తున్న వ్యాన్‌ను గంజాం భజరంగ్ దళ్ ప్రతినిధులు అడ్డుకున్నారు. ఐబీసీ అధికారి జయ కుమార్ పట్నాయక్ మరియు భజరంగ్ దళ్ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి అక్రమంగా సుమారు ఒక టన్నుకు పైగా లోడుతో వ్యాన్ జాతీయ రహదారి గుండా నగరంలోకి తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న భజరంగ్ దళ్ ప్రతినిధులు బొడపల్లి గ్రామ జాతీయ రహదారిపై కాపు కాశారు. ఈలోగా జాతీయ రహదారి గుండా ఎదురుగా వస్తున్న టాటా పికప్ వ్యాన్‌ను అడ్డుకొని సోదాలు చేయగా సుమారు టన్నుకు పైగా గో మాంసం పట్టుబడింది. దీంతో చమ్మఖండి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వ్యాన్‌ను సీజ్‌చేసి, డ్రైవర్, క్లీనర్‌ను అరెస్టు చేశారు.



రాష్ట్రపతికి ఘన స్వాగతం

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ సాదరంగా స్వాగతం పలికారు. మూడు రోజుల రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని సోమవారం రాష్ట్రపతి విచ్చేశారు. ఈ సందర్భంగా మయూర్‌భంజ్ జిల్లా బరిపద హెలిప్యాడ్‌లో స్వాగతించారు.

- భువనేశ్వర్

ముగిసిన కొరాపుట్ పర్వ్



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సైకత శిల్పం



పాటలు పాడుతున్న సంగీత కళాకారులు



వేడుకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు



ఉత్సవాలు తిలకించేందుకు పోటెత్తిన జన సమూహం



వేదికపై నృత్య ప్రదర్శనలు

జయపురం: జయపురం మున్సిపాలిటీ స్థాయి కొరాపుట్ పర్వ్–23 ఆదివాసీ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు ముఖ్య అతిథిగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొరాపుట్ పర్వ్ కేవలం ఆనందం కోసమే కాదని, మరుగున పడిన కళాకారుల ప్రతిభను వెలికితీసే వేదిక అన్నారు. అనంతరం ప్రతిభావంతులైన కళాకారులను సన్మానించారు. ముగింపు వేడుకలో ఆదివాసీ నృత్యాలు, సంగీత వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. సభా వేదిక ముందు ఏర్పాటు చేసిన కొరాపుట్ పర్వ్ సైకత శిల్పం ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

క్లుప్తంగా

పాతపట్నం జోగికొండపై పెద్దపులి



పాతపట్నం: దశరథపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

పాతపట్నం: పాతపట్నంను ఆనుకుని ఉన్న జోగికొండపై పెద్దపులి ఉన్నట్లు ఆనవాళ్లు ఉన్నాయని, పాతపట్నంతో పాటు కొండ చుట్టూ ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం ఫారెస్ట్ రేంజర్ ఆర్.రాజశేఖర్ అన్నారు. సోమవారం తెల్లవారుజామున అంతరాబ ఫారెస్ట్‌ను ఆనుకుని ఉన్న దశరథపురం శివాలయం పక్కన ఉన్న చెరువు వద్దకు పులి వెళ్లినట్లు ఆనవాళ్లు కనిపించాయని తెలిపారు. పాతపట్నం, అంతరాబ, దశరథపురం, తిడ్డిమి పరిసర ప్రాంత ప్రజలు సాయంత్రం అయితే బయటకు రావద్దని, రాత్రి వేళల్లో పంట పొలాలకు, తెల్లవారు జామున ఆలయాలకు వెళ్లవద్దన్నారు. దశరథపురంలో సోమవారం అవగాహన కల్పించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి పి.యశస్వి, ఎఫ్‌బీఓ కె.ఉమా మహేశ్వరరావు, ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

1104 సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోపాలరావు



గోపాలరావును సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

అరసవల్లి: ఏపీ ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల సంఘం (1104) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంవీ గోపాలరావు (గోపి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు విజయవాడ లయోలా కాలేజీలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఈయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగా ప్రధాన కార్యదర్శి హోదాలో గోపాలరావు తొలిసారిగా జిల్లాకు రావడంతో సోమవారం 1104 సంఘ నాయకులు, విద్యుత్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయన్ను ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక యూనియన్ కార్యాలయంలో కీలక ప్రతినిధులతో సమావేశమయ్యారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మెళియాపుట్టి: మండలంలోని సిరియాఖండి పంచాయతీ మాకనాపల్లి గ్రామానికి చెందిన మండల లక్ష్మీ నారాయణ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మధ్యాహ్నం గ్రామ శివార్లలోని ఓ తోటలో అపస్మారక స్థితిలో పడి ఉండటంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు లక్ష్మీనారాయణను పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'నీట్ పీజీలో అడ్మిషన్లు సరిచేయాలి'

కాశీబుగ్గ: ఇటీవల జరిగిన పీజీ మెడికల్ అడ్మిషన్‌లలో జరిగిన పొరపాట్లను సరి చేయాలని జిల్లా గ్రామీణ వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు డి.ఉమామహేశ్వరరావు కోరారు. రాష్ట్ర గవర్నర్‌కు ప్రత్యేకంగా లేఖ రాసి పంపిస్తూ అనంతరం పలాసలో పాత్రికేయులకు ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన నీట్ అడ్మిషన్‌లలో గైనకాలజీ సీటు కేటాయింపులో జరిగిన తప్పిదాన్ని ప్రస్తావించారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోరులో శ్రీకాకుళం తృతీయం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు వేదికగా ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు 9వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచి మెరిసింది. జిల్లా జట్టుకు కోచ్ మేనేజర్‌గా ఫిజికల్ డైరెక్టర్ డి.ఈశ్వరరావు వ్యవహరించి ముందుండి నడిపించారు. జిల్లా జట్టు రాణింపుపై హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి కృష్ణకుమార్, కార్యదర్శి ఎమ్మెస్సీ శేఖర్, సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర తైక్వాండో పోటీల్లో శ్రీకాకుళం హవా

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించి సత్తాచాటారు. గుంటూ రు జిల్లా తెనాలి వేదికగా ఈనెల 18, 19 తేదీల్లో ఏపీ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు మొత్తం 13 పతకాలు సాధించి శభాష్ అనిపించారు. ఇందులో నాలుగు బంగారు, రెండు రజతాలు, మరో ఏడు కాంస్య పతకాలు ఉన్నాయి. జిల్లా తైక్వాండో బృందానికి కోచ్ మేనేజర్లుగా కురి టి తారకరామా, లక్ష్మణరావు, ముద్దాడ శిరీష వ్యవ హరించి మెప్పించారు. సబ్ జూనియర్స్‌లో వివిధ బరువుల కేటగిరిల్లో నరేంద్ర నాయుడు కాంస్యం, లీలా మాధవ్ స్వర్ణం, మహర్ష్ కాంస్యం, మహేష్ కాంస్యం, త్రివేణి కాంస్యం, యశిత స్వర్ణం, దేవీప్రి య కాంస్యం , పల్లవి కాంస్య పతకాలు సాధించారు. అలాగే క్యాడేట్స్‌లోని వివిధ బరువు కేటగిరీల్లో మోక్షిత్ రజతం, ఢిలేశ్వరరావు స్వర్ణం, ప్రశాంత్ రజతం, హిమచందన్ కాంస్యం, తన్మయ్ స్వర్ణ పతకాలతో మెరిశారు. వీరి రాణింపుపై ఒలింపిక్ అసో సియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ కొమర భాస్క రరావు తదితరులు అభినందించారు.

సభా సమయం

- నేటి నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు
- స్పీకర్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం
- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు



భద్రతా వ్యవస్థను సమీక్షిస్తున్న డీజీపీ సునీల్ కుమార్ బన్సాల్

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 30వ తేదీ వరకు ఈ సమావేశాల నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. శీతాకాల సమావేశాలు జయప్రదం చేసేందుకు స్పీకర్ ప్రమీల మల్లిక్ సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సమావేశాలు ప్రారంభానికి ముందుగా ఆమె అఖిల పక్ష సమావేశానికి పిలుపునిచ్చారు.

అఖిలపక్ష సమావేశం

సభ సజావుగా సాగేందుకు వీలుగా స్పీకర్ ప్రమీలా మల్లిక్ సోమవారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సభా కార్యక్రమాలు సజావుగా సాగేందుకు సహకరించాలని, ముఖ్యమైన అంశాలపై సరైన చర్చ జరిగేలా చూడాలని ఆమె ప్రతి పక్ష శాసన సభ్యులను అభ్యర్థించారు. పలు అంశాలపై విపక్ష సభ్యులు చేసిన గందరగోళం కారణంగా గత రెండు విడతల శాసన సభ సమావేశాలు రద్దయినందున తాజాగా నిర్వహించిన అఖిల పక్ష సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

భద్రత ఏర్పాట్లు పటిష్టం

రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాల సందర్భంగా కమిషనరేట్ పోలీసు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో సభ పరిసరాల్లో ప్రత్యేక ట్రాఫిక్ మార్గదర్శకాలను జారీ చేసింది. హౌసింగ్ బోర్డ్ స్క్వేర్ నుంచి వచ్చే వాహనాలు కేశరి టాకీస్ స్క్వేర్ నుంచి ఎడమ వైపునకు మళ్లిస్తారు. ఏజీ స్క్వేర్ నుంచి పీఎంజీ స్క్వేర్ వైపునకు వచ్చే వాహనాలను జయదేవ్ భవన్ నుంచి కుడి వైపునకు మళ్లించి ఇందిరాగాంధీ పార్క్ రోడ్డు మీదుగా నడిపిస్తారు. మాస్టర్ క్యాంటీన్ నుంచి వచ్చే అన్ని వాహనాలు దిగువ పీఎంజీ పక్కనే ఉన్న వీధుల గుండా నడిపిస్తారు. 120 ఇన్‌ఫాంట్రీ బెటాలియన్ స్క్వేర్ నుంచి రవీంద్ర మండపం వైపు వెళ్లే వాహనాలు పవర్ హౌస్ స్క్వేర్ వైపునకు మళ్లిస్తారు. రాజ్ భవన్ చౌరస్తా నుంచి ఎమ్మెల్యే కాలనీ, రవీంద్ర మండపం వైపు నడిచే వాహనాలను శాస్త్రీనగర్ చౌరస్తా వైపునకు పంపిస్తారు. ఈ పరిమితులు అత్యవసర సేవా వాహనాలకు (పోలీస్, అగ్నిమాపక సేవలు మరియు అంబులెన్స్) మరియు రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయం మరియు ఆ ప్రాంతంలో ఉన్న ఇతర కార్యాలయాలతో సహా అధికారిక భవనాల్లోకి ప్రవేశించడానికి అధికారం ఉన్న వాహనాలకు వర్తించవని అనుబంధ వర్గాలు తెలిపాయి.

100 మంది అధికారుల పర్యవేక్షణలో...

శీతాకాల సమావేశాల సందర్భంగా శాసనసభ లోపల, బయట, పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(డీజీపీ) సునీల్ బన్సాల్ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శాసనసభ పరిసర ప్రాంతాల్లో ప్రత్యక్షంగా సందర్శించారు. శాసనసభ భద్రత కోసం 100 మంది అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో 28 ప్లాటూన్ల బలగాలను మోహరించినట్లు వివరించారు. అసెంబ్లీ భవనం చుట్టూ మూడంచెల భద్రతా వలయం ఉంటుంది. ఐదు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. సమావేశాల సందర్భంగా అసెంబ్లీ వెలుపల నిరసనలు మరియు ప్రదర్శనలను ఎదుర్కోవడానికి ప్రత్యేక బలగాలను మోహరించారు. భువనేశ్వర్ డీసీపీ సమగ్ర భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు.

సై అంటే సై

రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు వాడివేడిగా జరగనున్నాయి. ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మరియు కాంగ్రెస్ సభ్యులు ప్రభుత్వాన్ని చుట్టుముట్టేందుకు సిద్ధమయ్యారు. పలు సంచలనాత్మక శీర్షికలతో అధికార పక్షంపై దాడికి కత్తులు నూరుతున్నారు. వచ్చే ఏడాది లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. విపక్షాలు బీజేపీ, కాంగ్రెస్ అనేక ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలు, అవినీతి, గిరిజనేతరులకు గిరిజనుల భూముల బదలాయింపు ప్రధాన శీర్షికలుగా ప్రతిపక్షాలు ఈ సమావేశంలో లేవనెత్తే అవకాశం ఉంది. వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం శీర్షికతో ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్లు ప్రధాన విపక్షం బీజేపీ చీఫ్ విప్ మోహన్ మాఝి తెలిపారు. రాష్ట్రంలో పలుచోట్ల ఇటీవల చోటు చేసుకున్న రైతుల ఆత్మహత్యలు నిలువెత్తు తార్కాణంగా పేర్కొని ప్రభుత్వ వివరణ, తదనంతర కార్యాచరణపై ప్రశ్నించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రాంతీయ అసమతుల్యత, ఆరోగ్యం, విద్యలో వెనుకబాటుతనంపై తమ పార్టీ దృష్టి సారిస్తుందని కాంగ్రెస్ శాసన సభ నాయకుడు నరసింగ మిశ్రా అన్నారు. పెరుగుతున్న నిరుద్యోగం, వలసలు మరియు వ్యవసాయ రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం ఇతరేతర ప్రధాన ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించనున్నట్లు తెలిపారు. అయితే శాసన సభలో శీతాకాల సమావేశాలు పురస్కరించుకుని దాడికి సిద్ధమవుతున్న విపక్షాల ధోరణిపై ఎదురుదాడికి అధికార పక్షం సిద్ధమేనని తొడగొట్టడం విశేషం. విపక్షాల ధోరణిని వ్యూహాత్మకంగా ఎదుర్కొనేందుకు రంగం సిద్ధం చేసినట్లు బీజేడీ వర్గీయుల సమాచారం.



శాసనసభ ఆవరణలో భద్రతా దళాలు



శాసనసభ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ

సామాజిక శ్రేయస్సుకు విద్య కీలకం



పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న గవర్నర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: ఆర్థిక, సామాజిక శ్రేయస్సుకు విద్య కీలకమని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. మయూర్‌భంజ్ జిల్లా కులియానాలో ఆమె సోమవారం ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన చిన్నతనంలో ఇంటి దగ్గర పాఠశాల లేకుండేదని గుర్తు చేసుకున్నారు. దీంతో చదువు కోసం ఇంటి నుంచి చాల దూరం వెళ్లాల్సి వచ్చేది. ఇంటికి చేరువలో పాఠశాల లేకపోవడంతో అప్పట్లో చాలా మంది పిల్లలు చదువుకు దూరమయ్యారని తెలిపారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల ప్రారంభంతో స్థానికంగా ఉన్న పిల్లలకు విద్యనభ్యసించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. విద్యతో అన్ని రంగాల్లో రాణించవచ్చని బాలలను ప్రోత్సహించారు. విద్యావంతులైన వారు తమ అభివృద్ధితో పాటు దేశ, సమాజ ప్రగతికి దోహదపడతారన్నారు.

గిరిజనుల అభివృద్ధికి పథకాలు

గిరిజనుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో రైల్వేలు, జాతీయ రహదారులు, విద్య, ఆరోగ్యం తదితర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు భారత ప్రభుత్వం వివిధ మంత్రిత్వ శాఖల ద్వారా బహుముఖ పథకాలను ప్రారంభించిందని రాష్ట్రపతి తెలిపారు. గిరిజన పిల్లల విద్య కోసం దేశ వ్యాప్తంగా 700కు పైగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ పాఠశాలల్లో భారతదేశంలోని 3 లక్షల 50 వేల మందికి పైగా గిరిజన విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందగలుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గవర్నర్ రఘుబర్ దాస్, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ టుడు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రానికి 87 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు కేటాయించినట్లు మంత్రి బిశ్వేశ్వర్ టుడు తెలిపారు. వీటిలో 19 మయూర్‌భంజ్ జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులకు సాధికారత పెంపొందించడం ఈ పాఠశాలల లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ పాఠశాల సముదాయాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఉచిత బోర్డింగ్ సౌకర్యాలతో నాణ్యమైన విద్యా బోధన అందుబాటులో ఉంటుందన్నారు.



పాఠశాల ప్రారంభిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తదితరులు



కార్యక్రమానికి హాజరైన బాలలు

నీళ్ల ట్యాంక్‌లో అస్థి పంజరాలు..?



అస్థి పంజరాలను దించుతున్న అగ్నిమాపక సిబ్బంది

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లాలో ఒక గ్రామ సమీపంలోని తాగునీటి ప్రాజెక్టులో భాగంగా కొత్తగా నిర్మించిన నీళ్ల ట్యాంక్‌లో సోమవారం రెండు అనుమానాస్పద మానవ అస్థిపంజరాలు గుర్తించారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

జాజ్‌పూర్ సదర్ మండలం నిశ్చింత గ్రామ శివారులో తాగునీటి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ట్యాంక్‌లో అస్థిపంజరాలు కనిపించినట్లు సమాచారం. అస్థిపంజరాలు మనుషులవిగా భావిస్తున్నారు. అయితే ఈ విషయం ఇంకా ధ్రువీకరించబడలేదు. ఈ నేపథ్యంలో మరికొన్ని ఆధారాలను కనుగొనే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అస్థి పంజరాలను స్వాధీనం చేసుకుని పరీక్షల కోసం జాజ్‌పూర్ పట్టణంలోని జిల్లా ప్రధాన ఆస్పత్రి (డీహెచ్‌హెచ్)కి తరలించారు. నివేదిక అందిన తర్వాతే అస్థి పంజరాలు మనుషులవా లేక కోతులవా అనేది తేలనుందని పోలీసులు తెలిపారు. ప్రాథమిక సమాచారం మేరకు గ్రామ శివారులో ఉన్న నీళ్ల ట్యాంక్ నిర్మాణం పూర్తయినా ఇంకా ప్రారంభించలేదు. సరదాగా సోమవారం ట్యాంక్ పైకి ఎక్కిన ఇద్దరు చిన్నారులు ఈ అస్థి పంజరాలను గుర్తించారు. సమాచారం తెలియడంతో స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సమాచారం అందడంతో జాజ్‌పూర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వినిత్ అగర్వాల్, సబ్ డివిజనల్ పోలీసు అధికారితో పాటు పోలీసు బృందం సంఘటనా స్థలాన్ని సందర్శించింది. అగ్నిమాపక సిబ్బంది అస్థి పంజరాలను వెలికితీసి జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించి మరిన్ని వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు.

భారత్ ఓటమి తట్టుకోలేక ఆత్మహత్య



ఉరికి వేలాడుతున్న యువకుడి మృతదేహం

భువనేశ్వర్: ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్లో ఆదివారం ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమిని తట్టుకోలేక ఉరిపోసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన సోమవారం వెలుగు చూసింది. జాజ్‌పూర్ జిల్లాకు చెందిన నీలమణిదాస్ చిన్న కుమారుడు దేవ రంజన్ దాస్(23) అనే యువకుడు తన పొరుగువారి ఇంటి పైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం యువకుడి మృతదేహం అతని పొరుగువారి పైకప్పుకు వేలాడుతూ కనిపించడంతో, అతని కుటుంబ సభ్యులు సంఘటన గురించి బింజార్‌పూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు యువకుడిని జాజ్‌పూర్ జిల్లా ప్రధాన ఆస్పత్రి (డీహెచ్‌హెచ్)కి తరలించారు. అక్కడ వైద్యులు అతను చనిపోయినట్లు ప్రకటించారు. కుల్సాహి గ్రామానికి చెందిన పురుషోత్తం సాహు తెలిపిన వివరాల ప్రకారం.. దేవ రంజన్ కొన్ని మానసిక రుగ్మతలతో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఆదివారం అతను తన పొరుగువారి ఇంటిలో భారత్, ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్‌ను చూస్తూ భారత్ జట్టు ఓడిపోవడంతో నిరాశకు గురయ్యాడు. దీంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. యువకుడి మరణ వార్త తెలియడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

శివ..శివ.. శంభో..

కార్తీక మాసం సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కళకళలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి.. ఆలయాలకు వెళ్లి శివుడుకి అభిషేక పూజలు చేశారు. అర్చకులు గోత్ర నామాలతో ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



రాయగడ: బాలింకేశ్వర మందిరంలో బారులుతీరిన దృశ్యం



బరంపురం: స్వయంబు లింగానికి బిల్వ పత్రాలతో పూజలు



బరంపురం: అష్టశంబు లింగానికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



బరంపురం: నీలకంఠేశ్వర్ ఆలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకులు



బరంపురం: నీలకంఠేశ్వర్ ఆలయలో బారులుతీరిన భక్తులు



రాయగడ: పితామహల్ మందిరంలో భక్తులు



రాయగడ: నందీశ్వరుని వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

వైజాగ్–చెన్నై కారిడార్‌తో జిల్లాకు లబ్ధి

- నీతి ఆయోగ్ ప్రాంతీయ సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



వర్చువల్ విధానంలో ప్రాంతీయ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అపారమైన గ్రానైట్ నిల్వలు, 193 కిలోమీటర్ల సువిశాల సముద్ర తీరం, 175 కిలోమీటర్ల జాతీయ రహదారి, ప్రధాన రైల్వే లైను కలిగి ఉండటం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. విశాఖ వేదికగా ఉత్తరాంధ్ర జిల్లాల నీతి ఆయోగ్ జీ హబ్ ప్రాంతీయ సమావేశంలో వర్చువల్‌గా ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి తీసుకోగలిగే చర్యలపై మాట్లాడారు. ఒకప్పుడు వలసల జిల్లాగా పేరున్న శ్రీకాకుళం జిల్లాకు మెల్లమెల్లగా ఆ పేరు తొలగిపోతోందని చెప్పారు. వైజాగ్-చెన్నై కారిడార్ నిర్మాణంతో ఇచ్ఛాపురం వరకు వెళ్లే కారిడార్ కారణంగా జిల్లా రూపురేఖలు మారుతాయన్నారు. కొవ్వాడలో అణు విద్యుత్ కేంద్ర నిర్మాణంతో ప్రపంచ పటంలో కొవ్వాడకు స్థానం లభిస్తుందన్నారు. సువిశాలమైన సముద్ర తీరంలో టూరిజం, జెట్టీలు, ఫిష్ లాండింగ్ సెంటర్లు నిర్మించడం ద్వారా మత్స్యకారుల వలసల నివారణ సాధ్యమవుతుందన్నారు. నీతి ఆయోగ్ స్పెషల్ సెక్రెటరీ అనా రాయ్, స్టేట్ టాక్స్ కమిషనర్ గిరిజా శంకర్, నీతి ఆయోగ్ నేషనల్ అడ్వైజర్ పార్థసారధి రెడ్డి, మెకిన్సీ కంపెనీ ప్రతినిధులు అభిలేష్, వరల్డ్ రిసోర్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు తదితరులు లేవనెత్తిన పలు అంశాలకు కలెక్టర్ బదులిచ్చారు.

రాష్ట్రస్థాయి కబడ్డీలో శ్రీకాకుళం సత్తా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో విజయవిహారం కొనసాగిస్తున్నారు. ఈ సీజన్ మొత్తంలో అన్ని క్రీడాంశాల్లోను విజయబావుటా ఎగురవేస్తూ వస్తున్నారు. తాజాగా అన్నమయ్య జిల్లా చిత్వేల్ వేదికగా ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగిన ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్–14 బాలికల కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచి శభాష్ అనిపించింది. ట్రోఫీతోపాటు బంగారు పతకాలు, మెమోంటోలను అందుకున్నారు. ఈ టోర్నీలో అత్యద్భుతంగా రాణించిన ముగ్గురు క్రీడాకారులు బి.ఆకాంక్ష (జెడ్పీహెచ్‌స్కూల్ పల్లిసారధి), ఎ.చాందిని (జెడ్పీహెచ్‌స్కూల్ బాసురు), డి.సాయిజశ్వంత్ (జెడ్పీహెచ్‌స్కూల్ సీతాపురం) జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా జట్టు రాణింపుపై డీఈఓ కె.వెంకటేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు, పీడీలు, కబడ్డీ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం


కాలిపోతున్న పూరిల్లు

వీరఘట్టం: మండలంలోని వండవ గ్రామంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో పంట అప్పలనర్సమ్మ పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న ధాన్యం, బియ్యం, కొంత నగదు, వంట సామగ్రి కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.20 వేల వరకు ఆస్తినష్టం జరిగింది. ప్రమాదాన్ని స్థానికులు గమనించి మంటలను అదుపు చేశారు. విషయం తెలిసిన వెంటనే సర్పంచ్ మిడితాన కల్యాణి, సచివాలయ సిబ్బంది వెళ్లి జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. ప్రభుత్వపరంగా రావాల్సిన సహాయాన్ని అందిస్తామని బాధిత మహిళకు హామీ ఇచ్చారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగమేష్

పార్వతీపురంటౌన్: గరుగుబిల్లి మండలంలోని ఉద్దవోలు గ్రామానికి చెందిన కె.సంగమేష్ మద్యం తాగవద్దని భార్య మందలించినందుకు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బతుకు తెరువుకోసం వచ్చి విజయనగరంలోని బాబామెట్టలో సంగమేష్ కూలిపని చేసుకుంటున్నాడు. వీరఘట్టం మండలంలోని తలవరం అత్తవారింటికి ఇల్లు చూపుల కోసం భార్యాపిల్లలతో కలిసి ఆదివారం వెళ్లాడు. ఈ సందర్భంగా మందు తాగవద్దని భార్య చెప్పడంతో మనస్తాపానికి గురై పార్వతీపురంలో గడ్డిమందు కొనుక్కుని ఉల్లిభద్రలో మద్యంలో గడ్డిమందు కలిపి తాగాడు. ఈ విషయాన్ని స్నేహితులకు ఫోన్‌లో సంగమేష్ తెలియజేయగా చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి బైక్‌పై తరలించారు. ఆస్పత్రి ఔట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బొగ్గు లారీ బోల్తా


బోల్తాపడిన బొగ్గులారీ

గరుగుబిల్లి: పార్వతీపురం-శ్రీకాకుళం ప్రధాన రహదారి పరిధిలో చిలకాం గ్రామ మలుపువద్ద సోమవారం ఉదయం బొగ్గును తరలించే లారీ అదుపు తప్పి బోల్తా పడింది. వీరఘట్టం నుంచి పార్వతీపురం వైపు వస్తున్న బొగ్గులారీ చిలకాం బస్‌షెల్టర్ సమీపంలో అదుపు తప్పి పడిపోవడంతో లారీలో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు పెనుప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కారు ఢీకొని 17 గొర్రెల మృతి

- గాయాలపాలైన మరో 30 గొర్రెలు
- లబోదిబోమంటున్న కాపరులు


మృతిచెందిన గొర్రెలు

లక్కవరపుకోట: మండలంలోని అరకు-విశాఖపట్నం అంతర్‌రాష్ట్ర రహదారిలో సోంపురం జంక్షన్ సమీపంలో సోమవారం తెలవారుజామున కారు ఢీకొని 17 గొర్రెలు అక్కడికి అక్కడే మృతిచెందగా మరో 30 గొర్రెలు తీవ్రగాయాల పాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి గొర్రెల కాపరులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శృంగవరపుకోట మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన వారాది అప్పిలి, వారాది బంగారయ్య, బొబ్బిలి గోవింద, శ్రీనులు కొద్ది కాలం క్రితం సుమారు 3 వందల గొర్రెల మందను మేపు కోసం అనకాపల్లి జిల్లా సమీపంలోకి తీసుకెళ్లారు. సీజన్ ముగియడంతో స్వగ్రామానికి మందను తోలుకొస్తుండగా ఆదివారం రాత్రి సోంపురం జంక్షన్ సమీపంలో గల కాళీ స్థలంలో బసచేశారు. అక్కడి నుంచి తెలవారుజామున స్వగ్రామానికి బయల్దేరే క్రమంలో వెనుకనుంచి మితిమీరిన వేగంతో వచ్చిన కారు మందను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఢీకొట్టిన కారు అక్కడి నుంచి వేగంగా పరారైనట్లు కాపరులు తెలిపారు. గాయపడిన గొర్రెలకు ఎల్.కోట పశువైద్యాధికారిణి గాయత్రిదేవి వైద్యసేవలు అందించారు. ఈ ప్రమాదంపై ఎల్.కోట పోలీస్‌స్టేషన్‌లో గొర్రెల కాపరులు ఫిర్యాదు చేశారు.

గంగపుత్రులకు జీవన భరోసా



సంవత్సరం	లబ్ధిదారులు	సొమ్ము (రూ. కోట్లలో)
2019-20	2645	2.645
2020-21	2772	2.772
2021-22	2335	2.335
2022-23	2944	2.944
2023-24	3522	3.522
	మొత్తం	రూ.14.218కోట్లు

గంగపుత్రులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జీవన భరోసా కల్పిస్తోంది. మత్స్యకారుల ఇంట 'సంక్షేమ'కాంతులు నింపుతోంది. వేట విరామ సమయంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద రూ.10వేలు చొప్పున భృతి చెల్లిస్తోంది. ఇంజిన్‌బోట్లకు రాయితీపై డీజిల్, మత్స్యకారులు ప్రమాదానికి గురైతే కుటుంబం కోలుకునేలా ఆర్థిక సాయం, 50 ఏళ్లు పైబడిన వారికి పింఛన్లు, మత్స్యసంపద సాగుకు తక్కువ వడ్డీతో రుణాలు పొందేందుకు అనువుగా కిసాన్ కార్డులు, చేపల విక్రయానికి వీలుగా ఫిష్ ఆంధ్రా యూనిట్లు.. ఇలా మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను తరచిచూద్దాం.

- మత్స్యకారుల సంక్షేమానికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి
- వేట విరామ సమయంలో మత్స్యకార భరోసా
- నాణ్యమైన ఉత్పత్తుల విక్రయానికి ఫిష్ ఆంధ్రా యూనిట్లు
- నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గంగపుత్రుల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషిచేస్తోంది. వివిధ సంక్షేమ పథకాల కింద మత్స్యకారులకు సాయం చేస్తోంది. నాలుగున్నరేళ్లలో రాష్ట్ర బడ్జెట్‌లో మెరుగైన రీతిలో నిధులు కేటాయించింది. ఓ వైపు చేపల వేటను ప్రోత్సహిస్తూ మంచి జీవనోపాధి కల్పించడంతోపాటు, నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను వినియోగదారులకు అందించేందుకు చర్యలు చేపట్టింది. పూసపాటిరేగ మండలం చింతపల్లి వద్ద సుమారు రూ.23.74 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ యూనిట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల భూమిపూజ కూడా చేశారు. నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

వైఎస్సార్ మత్స్యకార భరోసా...

ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకూ చేపల వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకారులకు ఉపశమనం కలిగించేందుకు అర్హులందరికీ వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకాన్ని వర్తింపజేస్తోంది. ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.4 వేలు మాత్రమే ఇచ్చేవారు.

ఆయిల్ సబ్సిడీ...

మత్స్యకారుల మర పడవలకు డీజిల్‌పై సబ్సిడీని రూ.6.03 పైసల నుంచి రూ.9కి పెంచింది. దీనివల్ల జిల్లాలో 666 మెకనైజ్డ్ బోట్ యజమానులు ఏటా సుమారు రూ.1.80 కోట్ల వరకూ ప్రయోజనం పొందుతున్నారు.

మత్స్యకారులకు పరిహారం పెంపు...

సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు ఎవరైనా ప్రమాదవశాత్తూ మరణిస్తే, వారి కుటుంబాలు వీధిన పడకుండా ఆదుకొనేందుకు పరిహారాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచింది. గత ప్రభుత్వ హయాంలో రూ. 5 లక్షలు మాత్రమే ఉండేది.

జీవనోపాధి కోసం పింఛన్లు

50 ఏళ్లు పైబడిన మత్స్యకారులకు ప్రభుత్వం పింఛన్ అందజేస్తోంది. జిల్లాలో 2,227 మంది మత్స్యకారులకు రూ.2,750 చొప్పున ప్రతినెలా చేతికందుతోంది.

కిసాన్ క్రెడిట్ కార్డులు

సముద్ర, స్వదేశీ మత్స్యకారులకు ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డులను మంజూరు చేస్తోంది. వీటి ద్వారా ఆక్వా రైతులు, చేపల వ్యాపారులు, మత్స్యకార మహిళా సహకార సంఘాల సభ్యులు అతి తక్కువ వడ్డీ రేటుకే రుణాలు పొందే అవకాశం కల్పించింది. జిల్లాలో 2020-21 నుంచి ఇప్పటివరకు రూ. 38 లక్షల విలువైన 181 కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరయ్యాయి.

మత్స్య సాగుబడి...

చేపల ఉత్పత్తి పెంపు, మేలైన రకాల ద్వారా అధిక లాభం పొందేలా మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మత్స్య సాగుబడి పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వారికి అవసరమయ్యే సాంకేతిక సహకారాన్నీ అందిస్తోంది.

ఆక్వా ల్యాబ్ సేవలు...

ఆక్వాకల్చర్‌లో నకిలీలను నియంత్రించేందుకు, విజయనగరంలో ఇప్పటికే ఉన్న ఒక ఆక్వా ల్యాబ్‌ను మరింత ఆధునీకరించారు. ఆక్వా కల్చర్ రైతులకు ఇన్‌పుట్ టెస్టింగ్ సౌకర్యాలకు కల్పించడానికి, సాంకేతిక సేవలను అందించడానికి, జిల్లా నుంచి మత్స్య ఎగుమతులను పెంచడానికి ఇది ఎంతగానో దోహదపడుతోంది.

నేడు ప్రత్యేక కార్యక్రమం...

ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంగళవారం మత్స్యకారులకు వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లాంఛనంగా ప్రారంభిస్తారు. జిల్లాలో 32 మంది మత్స్యకారులకు ఒక్కొక్కటీ రూ.75వేల విలువైన ద్విచక్ర వాహనాలు, రూ.60 లక్షల విలువైన మూడు లైవ్ ఫిష్ రవాణా వాహనాలను పంపిణీ చేయనున్నారు.

మత్స్య సంపద యోజన

మత్స్యకారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన' పథకాన్ని ప్రవేశపెట్టింది. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో జిల్లాకు సుమారు రూ.11.77 కోట్లను కేటాయించింది. మత్స్యకారులకు అవసరమైన పరికరాలు, ద్విచక్ర వాహనాలను ఈ పథకంలో పంపిణీ చేస్తున్నారు. ఆక్వా హబ్‌లు, లాంజ్‌లు ఏర్పాటు, లైవ్ ఫిష్ తరలింపు వాహనాల పంపిణీ, విక్రయ కేంద్రాలు, కియోస్క్‌లు, ఫింగర్ లింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర కార్యక్రమాలను చేపడుతున్నారు.

ఆక్వా హబ్‌లు..

సాంప్రదాయ మత్స్యకారుల ఆర్థిక స్థితి, పోషకాహార భద్రత, పరిశుభ్రతను పెంపొందించడమే లక్ష్యంగా ఒక్కొక్కటీ రూ.కోటి వ్యయంతో ఆక్వా హబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. జిల్లాకు మూడు కేటాయించింది. ప్రస్తుతం రేగిడి మండలం సంకిలి వద్ద ఒక యూనిట్ నిర్మాణంలో ఉంది.


తీరంలో చేపల విక్రయిస్తున్న మహిళ

మేలు చేసింది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే...



మత్స్యకారులకు అన్నివిధాలా మేలు చేసింది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రమే. అనేక సంక్షేమ పథకాలను అర్హత ఒక్కటే ప్రామాణికంగా అమలు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట నిషేధ కాలంలో జీవనభృతి సమయానికి రాక ఇబ్బందిపడేవాళ్లం. ఇప్పుడు నేరుగా బ్యాంకు ఖాతాకే జమవుతోంది.

– వాసుపల్లి కన్నయ్యతాత, మత్స్యకారుడు, తిప్పలవలస

మత్స్యకారులకు మంచిరోజులు



మత్స్యకారులకు మంచి రోజులు వచ్చాయి. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లోటింగ్ జెట్టీని సుమారు రూ.25 కోట్ల నిధులతో నిర్మించాలని సంకల్పించారు. ఇది సాకారమైతే మత్స్యకారులకు ఇక్కడే ఉపాధి దొరుకుతుంది. వలసలు తగ్గుతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మందికి మేలు జరుగుతుంది.

–బర్రి చినఅప్పన్న, జిల్లామత్స్యకార సొసైటీ అధ్యక్షుడు

మత్స్యకారులకు భరోసా..



జగనన్న ప్రభుత్వంలో మత్స్యకారుల ఆర్థిక పరిస్థితి బాగుపడుతోంది. అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు ఇవ్వడంతో మత్స్యకారుల్లో ఆత్మస్థైర్యం పెరిగింది. అన్నివిధాలా ఆదుకుంటున్న జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలని కోరుకుంటున్నాం.

– మైలపల్లి నరసింహులు, రాష్ట్ర మత్స్యశాఖ డైరెక్టర్

ఫిష్ ఆంధ్రా యూనిట్లు...

నాణ్యమైన చేపలను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ఫిష్ ఆంధ్రా యూనిట్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఒక్కో యూనిట్ ఖరీదు రూ.1.75 లక్షలు కాగా ఎస్సీలు, ఎస్టీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఇస్తోంది. జిల్లాలో 62 యూనిట్లు ఇప్పటివరకూ ఏర్పాటయ్యాయి. ఒక్కొక్కటీ రూ.10లక్షల చొప్పున వ్యయంతో నాలుగు ఫిష్ కియోస్క్‌లు జిల్లాకు మంజూరయ్యాయి. ఒకటి రాజాంలో ఏర్పాటైంది. ఫిష్ లాంజ్‌లు ఒక్కొక్కటీ రూ.15లక్షలతో ఏర్పాటు చేస్తున్నారు. ఒక యూనిట్ పూసపాటిరేగలో ప్రారంభమైంది.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కొప్పెర్ల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 15,16,17 తేదీలలో కర్నూలు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరఫున ఆడి విజేతలుగా నిలవడంతో పాఠశాలకు చెందిన అజయ్‌కుమార్, ఎ.రాజు, బి.శ్రావణ్‌కుమార్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాగా ఢిల్లీలో జరగబోయే జాతీయ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొననున్నారు. పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికకావడంతో ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, వైస్‌ప్రిన్సిపాల్ రఘురామనాయుడు, పీడీ కృష్ణ, పీఈటీ సత్యనారాయణతో పాటు ఇతర ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్ల సత్తా


బాలికల జట్టు


బాలుర జట్టు

బొబ్బిలి: గుంటూరు జిల్లా వెలిగండ్లలో ఈనెల 18,19,20 తేదీల్లో జరిగిన అండర్ -14 రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో విజయనగరం జిల్లా బాలికలు, బాలుర జట్లు ప్రథమ స్థానం సాధించినట్లు కోచ్, మేనేజర్‌లు సత్యనారాయణ, అప్పలనాయుడులు తెలిపారు. గెలుపొందిన జట్లు వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. జిల్లా జట్లలో 11 మంది బొబ్బిలి మండలం పారాదిలోని జెడ్పీఉన్నత పాఠశాల క్రీడాకారులేనని పీడీ ఎస్ వెంకటనాయుడు తెలిపారు. జయశ్రీ,మాన్విత, నాని, మోహన్ సాయి, పవన్‌లు పారాదిలో చదువుతున్నారని, మిగతా వారు ఆరికతోట పాఠశాలలో చదువుతున్నారన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికవడం పట్ల పారాది హెచ్‌ఎం నాగేశ్వరరావు అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక


ఆర్చరీలో తలపడుతున్న విద్యార్థులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ నెల 23 నుంచి విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరగనుండడంతో ఇక్కడ 26 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వాలీబాల్, ఆర్చరీ, జావెలిన్‌త్రోలో క్రీడాకారులకు పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో డిప్యూటీఈవో ఎ.లిల్లీరాణి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, ఏఎంవో కోటిబాబు, సూపరింటెండెంట్ దేశ్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా సెక్రటరీ రాజేంద్ర, పీడీలు ఆర్‌సీ రెడ్డి, ఎంవీరమణ, బీవీ రమణ, వీపీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు జీసీఎస్‌ఆర్ విద్యార్థినులు


సౌత్‌జోన్ ఇంటర్‌యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

రాజాం సిటీ: ఈ నెల 22 నుంచి 25 వరకు తమిళనాడు రాష్ట్రంలోని అలగప్ప యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్‌యూనివర్సిటీ మహిళల కబడ్డీ పోటీలకు స్థానిక జీసీఎస్‌ఆర్ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారని పీడీ చీకటి కేశవనారాయణ సోమవారం తెలిపారు. ఇటీవల అంబేడ్కర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పొందూరులో జరిగిన పోటీల్లో కళాశాలకు చెందిన ఎస్.అమృత, బి.భవాని ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారన్నారు. వారి ఎంపికపట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తమరావుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు


నూతన పుస్తకాలను ఆవిష్కరించిన వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

- జేఎన్‌టీయూ జీవీ లైబ్రరీలో 364 కొత్తపుస్తకాల ఆవిష్కరణ

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ప్రాంగణంలో డాక్టర్ వైఎస్సార్ సెంట్రల్ లైబ్రరీలో 364 కొత్తపుస్తకాలను వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య సోమవారం ఆవిష్కరించారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రస్తుతం లైబ్రరీలో ఉన్న 24,907 వాల్యూమ్‌లకు కొత్త పుస్తకాలను అనుసంధానం చేసినట్లు వీసీ తెలిపారు. డెల్‌నెట్ ఆన్‌లైన్ జర్నల్స్, ఈ-బుక్స్, ఐఈఈఈ ఆన్‌లైన్ జర్నల్స్, మ్యాగజైన్స్, న్యూస్‌పేపర్స్, డిజిటల్ లైబ్రరీలో 10 కంప్యూటర్ సిస్టమ్స్ అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం బీటెక్ ఆర్23 రెగ్యులేషన్స్ కోసం, జనరల్, గేట్, ఇతర పోటీ పరీక్షల పుస్తకాలను కొత్త పుస్తకాలతో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. దీనివల్ల ఇంజినీరింగ్ విద్యార్థులకు లైబ్రరీ పఠనంపై ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గురునాథ, ఆఫీసర్ ఇన్‌చార్జ్ లైబ్రరీ డాక్టర్ చింతానీలిమాదేవి, లైబ్రరీ అసిస్టెంట్ జి.ఈశ్వరరావు వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేయాలి

విజయనగరం అర్బన్: జిల్లాలో అర్హులైన యువతను ఓటర్లుగా చేర్పించడంపై మండల ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. ముఖ్యంగా కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ ఓటర్లుగా నమోదయ్యేలా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్స్ నుంచి విద్యార్థుల జాబితాలు సేకరించి వారిలో ఎంతమంది ఓటరుగా నమోదు చేసుకున్నదీ ఆరా తీసి ఓటరుగా నమోదు కాని వారందరినీ ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని జేసీ మయూర్ అశోక్ చేపట్టారు. జేసీతోపాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత, రెవెన్యూ డివిజన్ అధికారి ఎంవీసూర్యకళ, డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శనదొర, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సుమబాల తదితరులు వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కారం కోసం అర్జీలను పంపించారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా గ్రీవెన్స్‌లో అర్జీలు అందించారు. కార్యక్రమంలో మొత్తం 241 వినతులు అందాయి.

స్పందన ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం

విజయనగరం క్రైమ్: స్పందనలో వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులకు సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల నుంచి 31 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, చట్టపరిధిలో న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చర్యలను ఏడు పనిదినాల్లో పరిష్కరించేలా చర్యలు చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఇ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వీటీ అగ్రహారం విద్యార్థులు


రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ పోటీలకు నగరంలోని వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14, 17 విభాగాల్లో బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాంశంలో టి.లాస్య, విక్రమ్, రాహుల్ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. అదేవిధంగా సెపక్‌తక్రా పోటీలకు ఎస్. సుజాత, పి.లహరి, పి.పూజిత, హేమంత్, ప్రవీణ్, శేఖర్, సాయిదేవహర్ష, సాయి వినయ్, శివకుమార్, వీఎస్ వరుణ్‌కుమార్ ఎంపికయ్యారన్నారు. సాఫ్ట్ టెన్నిస్ క్రీడాంశంలో పి.సాగర్, ఎం.పవన్ కల్యాణ్, ముఖేష్, ఎస్. నవీన్... నెట్‌బాల్ క్రీడాంశానికి సంబంధించి ఐ.తేజశ్విని, ఎం.ముఖేష్ ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం క్రీడాకారులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ధర్మారావును ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఆర్థిక అభివృద్ధికి పుష్కలంగా అవకాశం


మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఆర్థిక అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. నీతి ఆయోగ్ స్పెషల్ సెక్రెటరీ అనారాయ్, స్టేట్ ట్యాక్స్ కమిషనర్ గిరిజా శంకర్‌లు విశాఖపట్నంలోని వీఎంఆర్‌డీఏ మీటింగ్ హాల్ నుంచి సోమవారం నిర్వహించిన నీతి ఆయోగ్ జి.హబ్ ప్రాంతీయ సమావేశానికి కలెక్టర్ నిషాంత్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరయ్యారు. సమావేశంలో ఆయన జిల్లా అభివృద్ధి అవకాశాల నివేదికను తెలియజేస్తూ పార్వతీపురం మన్యం జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన భూమి, నీరు, మానవవనరులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలు ఉన్నాయని, ధాన్యం దిగుబడికి ప్రసిద్ధిచెందినదని, 98 బియ్యం మిల్లులు ఉన్నాయన్నారు.

పారిశ్రామికంగా అభివృద్ధికి అవకాశాలు

పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు జిల్లాలో చక్కని అవకాశాలు ఉన్నాయని, జిల్లాలో నిర్మితమవుతున్న జాతీయరహదారిని ఆనుకుని 1400 ఎకరాల విస్తీర్ణంలో రెండు పారిశ్రామిక వాడలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, మానవవనరులు తక్కువ ధరకే లభిస్తాయని, జిల్లాకు ఒడిశాతో సరిహద్దులున్నాయని, ఎగుమతి అవకాశాలున్నాయని చెప్పారు. విశాఖపట్నం ఓడరేవు, విజయనగరంలో నిర్మితమవుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, జాతీయ రహదారిపై జిల్లా నుంచి రవాణాకు అనుసంధానమవుతున్నాయని తెలిపారు. పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉందన్నారు. జిల్లాలో పర్యాటకం, ఎకోటూరిజం, సాంస్కృతిక టూరిజం అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలున్నాయని వివరించారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన వాటర్‌ఫాల్స్, సాగునీటి జలాశయాలు, దేవాలయాలు, వ్యూపాయింట్స్, పార్వతీపురంలో టూరిజం పార్క్, పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో గిరిజన సంఘాల ద్వారా అటవీ ఉత్పత్తులను తయారు చేసి, ఉత్పత్తులకు సొంత బ్రాండింగ్ ద్వారా విక్రయిస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన పసుపు దిగుబడిలో దేశంలో రెండవ స్థానంలో ఉన్నామని, జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటల ఆధారిత పరిశ్రమలు స్థాపించేందుకు ఎక్కువ అవకాశాలున్నాయన్నారు. రెండు తృణధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఓ వీర్రాజు, పరిశ్రమల అధికారి కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.